సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 6 । జనవరి । 2025

వైభవంగా పల్లకీ శోభాయాత్ర

జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీరామ పల్లకీ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ, శ్రీ కృష్ణ నామస్మరణతో పట్టణ వీధులు మారుమ్రోగాయి. కార్యక్రమంలో యాగ నిర్వాహకులు శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

– ఆదిలాబాద్



పల్లకీ శోభాయాత్రలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, స్వరూపానంద స్వామి తదితరులు

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

కైలాస్‌నగర్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదిలాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లా వాసులు విషయాన్ని గమనించాలని సూచించారు.

ఆర్పీల గౌరవ వేతన బకాయిలు విడుదల

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న మెప్మా ఆధ్వర్యంలోని ఆర్పీల పెండింగ్ గౌరవ వేతనంను ప్రభుత్వం విడుదల చేసింది. గతేడాది జూన్ నుంచి నవంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 85 మందికి సంబంధించి రూ.30.60లక్షలను విడుదల చేసింది. దీంతో వారి నిరీక్షణకు తెరపడినట్లయింది. రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని డీఎంసీ శ్రీనివాస్ తెలిపారు.

'పులి సంచరించిన ఆనవాళ్లు లేవు'



పరిశీలిస్తున్న సెక్షన్ అధికారి, సిబ్బంది

తాంసి: పిప్పల్‌కోటి శివారులో పులి సంచరించినట్లుగా ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని అటవీ సెక్షన్ అధికారి అహ్మద్‌ఖాన్ తెలిపారు. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి శివారులోని పంట చేలో శనివారం మూడు పశువులను అటవీ జంతువులు హతమార్చిన విషయం తెలిసిందే. కాగా పులిదాడిలోనే మరణించినట్లు భావించిన గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో సెక్షన్ అధికారి సిబ్బందితో కలిసి ఆదివారం అక్కడికి చేరుకున్నారు. పశువులు మృతి చెందిన ప్రదేశాలు, చుట్టుపక్కల ఉన్న అడవిని పరిశీలించారు. వాటి కళేబరాల వద్ద పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్‌తో కలిసి పంచనామా నిర్వహించారు. కాగా పశువులను హతమార్చిన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అందులో ఎలాంటి జంతువుల కదలికలు కనిపించలేదని సెక్షన్ అధికారి తెలిపారు. ప్రస్తుతం పులి సంచరించినట్లుగా ఎలాంటి ఆనవాళ్లు లేనందున రైతులు, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. అటవీ జంతువులు సంచరించినట్లు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వెంట బీట్ అధికారి సాయి కుమార్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, సోనేరావు సిబ్బంది ఉన్నారు.

- ఇంటి పెరటిలోనూ సాగు
- ఏజెన్సీ ప్రాంతాల్లో అధికం
- పల్లె నుంచి పట్టణాలకు సరఫరా
- గుట్టుగా విక్రయాలు.. యువకులే టార్గెట్
- జిల్లాలో పెరుగుతున్న కేసులు

గుప్పుమంటున్న గంజాయి



బోథ్ మండలం కృష్ణానగర్(దేరా) గ్రామంలో ఓ వ్యక్తి ఇంటి వద్ద పెరటిలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న విషయం పోలీసులకు తెలిసింది. గతేడాది డిసెంబర్ 19న ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఎనిమిది మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. గంజాయిని ఎండబెట్టి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు.

జిల్లాలో..	గతేడాది పట్టుబడిన గంజాయి : 1044.137 కిలోలు	వాటి విలువ : రూ.2.24కోట్లు	నమోదైన కేసులు : 77	అరెస్టయిన వారు : 152

- ఇచ్చోడ మండలం దూబార్‌పేట్ ప్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఈనెల 2న రాత్రి గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అతడు తీసుకెళ్తున్న సంచిని పరిశీలించగా అందులో 4కిలోల సరుకు లభ్యమైంది. దాని విలువ రూ.లక్ష వరకు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేశారు.
- గతేడాది డిసెంబర్ 19న బోథ్ మండలం సొనాల సమీపంలో గల ఓ గ్రామానికి చెందిన వ్యక్తి గంజాయిని ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ మరుసటి రోజు ఇదే మండలంలోని పొచ్చెర గ్రామం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మరో వ్యక్తి నుంచి పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.
- గతేడాది ఆగస్టు 6న బోథ్ మండలం గుర్రాల తండా గ్రామానికి చెందిన తండ్రీకొడుకులైన చౌహాన్ దేవిసింగ్, గులాబ్‌సింగ్ గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. వీరుగతంలో హైదరాబాద్‌లోని ఓ వ్యక్తికి గంజాయి విక్రయించారు.సదరు వ్యక్తి అక్కడ విక్రయిస్తూపోలీసులకు చిక్కాడు. విచారణలో గుట్టు రట్టయింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందం గుర్రాలతండాకు చేరుకుని తండ్రీకొడుకులను అరెస్టు చేశారు.



గుర్రాలతండా వద్ద తండ్రీకొడుకులను అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

ఇవే మచ్చుకు కొన్ని మాత్రమే. జిల్లాలో తరచూ ఏదో చోట గంజాయి కేసులు నమోదవుతుండడం గమనార్హం.

బోథ్: జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో కొందరు గుట్టుగా సాగు చేస్తూ అక్కడి నుంచి పట్టణాలకు తరలిస్తున్నారు. వీటిని ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఇటీవల పలువురు జిల్లావాసులు ఇతర జిల్లాల వారికి విక్రయిస్తూ పట్టుబడ్డారు. రాష్ట్రంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు జిల్లాలో లభ్యమవుతుండడం కొంత ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతం ఉండటంతో కొంతమంది రైతులకు ఆశచూపి అటవీ ప్రాంతాల్లో ఈ సాగు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి రాత్రివేళల్లో గుట్ట, బండ్లబాట మార్గాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మంచి రాబడి ఉండడంతో పలువురు దీనిని ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారు. జిల్లాలో గతేడాది 77 గంజాయి కేసులు నమోదయ్యాయి. మొత్తం 1,044.137 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.2 కోట్లకు పైమాటే.

ఇతర జిల్లాలకు సరఫరా..

జిల్లాకు చెందిన కొంతమంది యువకులు హైదరాబాద్‌కు వెళ్తున్నామంటూ బ్యాగుల్లో గంజాయి తీసుకెళ్తున్నారు. అక్కడ వివిధ ప్రాంతాల్లో పబ్బుల వద్ద ఉన్న ఏజెంట్లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కార్లు, బస్సుల్లోనే ఎక్కువగా రవాణా అవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వీకెండ్ సమయంలో అక్కడికి వెళ్లి ఈ దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకొంతమంది హైదరాబాద్, ముంబాయి తదితర ప్రాంతాల్లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్, సిరికొండ, గుడిహత్నూర్, నార్నూర్, గాదిగూడతో పాటు పలు మండలాల్లోని యువకులు హైదరాబాద్‌లో వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజరాహిల్స్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్, గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్ సిటీ తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌ల్లో వీరు పనిచేస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా ఉద్యోగాలు చేస్తూ పబ్బుల్లో ఉండే ఏజెంట్లతో గుట్టుగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. తమ పల్లెల్లో అంతరపంటగా సాగు చేస్తూ వారి బంధువులు, స్నేహితుల ద్వారా తమ వద్దకు తెప్పించుకుంటున్నారు. ఇలా సెకండ్ బిజినెస్‌గా వారానికి రూ.20 వేల నుంచి రూ. 30వేల వరకు సంపాదిస్తున్నారు.

జిల్లాలో గుట్టుగా సాగు..

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ సాగు ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అక్కడి వారి నుంచి కొందరు తక్కువ ధరకు కొనుగోలు చేసి పట్టణాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో బోథ్, గాదిగూడ, సిరికొండ, నార్నూర్, బజార్‌హత్నూర్ మండలాల్లో ఎక్కువగా సాగవుతున్నట్లు సమాచారం. గంజాయిని పొడిగా చేసి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. వీటికి అలావాటు పడిన యువకులు సిగరేట్‌లోని తంబాకు తీసివేసి అందులో గంజాయి నింపుకుని నిషాకు బానిసవుతున్నారు. ఎక్సైజ్, పోలీసు అధికారులు గ్రామాల్లో దాడులు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిఘా పెంచాం..

జిల్లాలో గంజాయి సాగు, విక్రయాలపై నిఘా పెంచాం. గతేడాది 77 కేసులు నమోదు చేశాం. 1044.137 కిలోల సరుకును సీజ్ చేశాం. ఇతర జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ రవాణాకు అడ్డుకట్ట వేసే చర్యలు చేపడుతున్నారం. ఏజెన్సీ గ్రామాలపై ఫోకస్ పెంచాం. ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తాం. గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. యువత గంజాయికి బానిస కావద్దు. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. –గౌస్ ఆలం, ఎస్పీ

'స్థానిక'ంపై ఫోకస్

- జిల్లా నుంచే కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం
- నేడు పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం
- హాజరుకానున్న పీసీసీ చీఫ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి



కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలపై అధికార కాంగ్రెస్ పార్టీ ఫోకస్ పెట్టింది. త్వరలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో కేడర్‌ను సన్నద్ధం చేసే దిశగా దృష్టి సారించింది. ఎన్నికల్లో విజయానికి ఆదిలాబాద్ జిల్లాను సెంటిమెంట్‌గా భావిస్తున్న హస్తం పార్టీ.. 'స్థానిక' సమరానికి సైతం జిల్లా నుంచే సమర శంఖం పూరించాలని సంకల్పించింది. ఈ మేరకు సోమవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహిస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి అతిథులుగా హాజరై ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. దీంతో రాజకీయంగా ఎన్నికల వేడి రాజుకునే అవకాశం కనిపిస్తోంది.

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లాను సెంటిమెంట్‌గా భావిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాలోని ఇంద్రవెల్లి అమర వీరుల స్తూపం వేదికగా దళిత, గిరిజన దండోరా పేరిట ఎన్నికల ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2023 డిసెంబర్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ విజయ ఢంకా మోగించి అధికారం చేపట్టింది. సీఎంగా బాధ్యతలు చేపట్టాక కూడా రేవంత్ రెడ్డి ఇదే ఆనవాయితీ కొనసాగించారు. తొలుత ఇంద్రవెల్లిలోనే పర్యటించారు.

సెంటిమెంట్ ఆనవాయితీగా..

తాజాగా స్థానిక సంస్థల నిర్వహణకు ఈసీ రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరు లేదంటే ఫిబ్రవరి మొదటి వారంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఆ తర్వాత మండల, జెడ్పీ, మున్సిపల్ ఎన్నికలు వరుసగా జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటిలోనూ సత్తా చాటాలని ఆ పార్టీ అధిష్టానం భావిస్తోంది. అందుకు కేడర్‌ను పూర్తిస్థాయిలో సంసిద్ధులను చేసే దిశగా కార్యాచరణ రూపొందించింది. అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్షలను నిర్వహించాలని భావించిన హైకమాండ్ ఆదిలాబాద్ జిల్లా నుంచే శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే సోమవారం నిర్వహించనున్న ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం.

కేడర్‌లో జోష్ నింపేలా...

అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ పరంగా ఎలాంటి సమీక్షా సమావేశాలు నిర్వహించలేదు. అయితే కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల పూర్తిస్థాయి అమలుపై ప్రతిపక్షాలు దూకుడుగా వ్యవహరించి సర్కారును ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ పరిణామాలతో పార్టీ కేడర్‌లోనూ జోష్ తగ్గి కాస్తా నిరుత్సాహం ఆవరించింది. పైగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే అందులో అధికార పార్టీ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఒక్కరు మాత్రమే ఉన్నారు. మిగతా ఆరు నియోజకవర్గాల్లోనూ బీజేపీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. దీంతో తమ సమస్యలను ఆలకించే వారు లేరనే ఆవేదన కేడర్‌లో వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న శ్రేణుల్లో జోష్ నింపి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు త్వరలో అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు వంటి వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఎన్నికలకు సంసిద్ధులను చేసేలా పార్టీ ఈ సమావేశాన్ని నిర్వహిస్తోంది. మావల మండల కేంద్రంలోని పద్మనాయక గార్డెన్‌లో సోమవారం మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించనున్న సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో రానున్న స్థానిక సంస్థలతో పాటు త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఎలాంటి కార్యాచరణ అనుసరించాలి.. గెలుపు కోసం ఏ విధంగా ముందుకు సాగాలనే దానిపై సదరు నేతలు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి సమావేశం, పైగా ఎన్నికలకు సంబంధించినది కావడంతో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు దీన్ని సవాలుగా తీసుకుని పెద్ద ఎత్తున కేడర్‌ను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనసమీకరణ ద్వారా తమ సత్తా చాటాలని భావిస్తున్నారు.

నేడు జిల్లాకు మంత్రి సీతక్క రాక

- రూ.17.11కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ నెల 6న జిల్లాలో పర్యటించనున్నారు. రూ.14.36 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అలాగే రూ.2.75 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ మేరకు మంత్రి పర్యటనకు సంబంధించిన అధికారికషెడ్యూల్ ఖరారైంది. 5న సాయంత్రం 6గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి రాత్రి 11గంటలకు జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 6న ఉదయం 10.05 గంటలకు రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి దస్నాపూర్‌కు చేరుకుని ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.10.50కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు, అలాగే చిల్కూరి లక్ష్మీనగర్‌లో రూ.1.43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పీహెచ్‌సీ భవనానికి బీసీ స్టడీ సర్కిల్ వద్ద శిలాఫలకం ఆవిష్కరించనున్నారు. జిల్లాలోని 20 గ్రామీణ మండలాల్లో రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న ఇందిరమ్మ మోడల్‌ఇళ్ల నిర్మాణానికి మావల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉదయం 10.40గంటలకు భూమి పూజ చేస్తారు. ఇదే మండలం దుబ్బగూడలో రూ.1.43కోట్ల వ్యయంతో నిర్మించనున్న పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి ఉదయం 11.05 గంటలకు భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి రిమ్స్‌కు చేరుకుని ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ప్రారంభిస్తారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవం పురస్కరించుకుని చేపట్టే బైక్ ర్యాలీని బాబు జగ్జీవన్‌రాం చౌక్‌లో మధ్యాహ్నం 12గంటలకు జెండాఊపి ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.05 గంటలకు రూ.2కోట్ల వ్యయంతో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ సమీపంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. 12.20 గంటలకు టీటీడీసీకి చేరుకుని రూ.75లక్షల వ్యయంతో నిర్మించిన జిల్లా సమాఖ్య నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి తిరిగి పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. లంచ్ తర్వాత మధ్యాహ్నం 1.30గంటలకు మావలలోని పద్మనాయక గార్డెన్‌లో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం నిర్మల్ జిల్లాకు బయలుదేరి వెళతారు. పర్యటన విజయవంతానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

అప్రమత్తం

- హెచ్‌ఎంపీవీపై అలర్ట్
- కోవిడ్‌ను మరిచిపోతున్న తరుణంలో మరో వైరస్
- భయాందోళన అవసరం లేదంటున్న వైద్యారోగ్యశాఖ
- అప్రమత్తంగా ఉండాలని సూచన





GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE DIRECTOR OF PUBLIC HEALTH AND FAMILY WELFARE

Date: 04/01/2025

Press note

There are news about a Human metapneumovirus (HMPV) outbreak in China in various electronic & print media platforms. The DGHS and Director NCDC, MoH&FW, GOI issued a statement on 03/01/2025 that Metapneumovirus (HMPV) is like any other respiratory virus which causes a common cold and flu-like symptoms during winter season, especially among younger & older age groups.

So far, no case of Human metapneumovirus (HMPV) is reported in Telangana.

The Health Department has analysed the data of prevailing respiratory infections within the state. There is no substantial increase in December 2024 compared to 2023.

As a part of precautionary measure, the Health Department urges citizens to follow certain Do's & Don'ts as a safe guard against respiratory infections.

DOs:

- Cover your mouth and nose with handkerchief or tissue paper, when you cough or sneeze.
- Wash your hands often with soap and water or alcohol-based sanitizer
- Avoid crowded places; stay at more than an arm's length from persons affected with flu.
- Stay away from public places if you have fever, cough and sneezing.
- Drink plenty of water and eat nutritious food.
- Adequate ventilation with outdoor air is recommended in all settings to reduce the transmission
- Stay at home and limit contact with others if you are sick
- Sleep well

DON'Ts

- Shaking hands
- Reuse of tissue paper & handkerchief
- Close contact with sick people
- Frequent touching of eyes, nose & mouth
- Spitting in public places

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు

భయాందోళన అవసరం లేదు



కొత్త రకం వైరస్ హెచ్‌ఎంపీవీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి భయాందోళనలు అవసరం లేదు. రాష్ట్రంలో ఇంతవరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. అయితే కోవిడ్‌లో పాటించిన నిబంధనలు పాటిస్తే ప్రమాదం ఉండదు. ప్రతిఒక్కరూ మాస్కులు ధరించడం, శానిటైజర్ వాడటం, భౌతిక దూరం పాటించడం చేయాలి. దగ్గు, జలుబు ఉంటే వైద్యులను సంప్రదించాలి. తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలి. ఈ వైరస్ కూడా కోవిడ్ లక్షణాలు కలిగి ఉంది. అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: కోవిడ్ మహమ్మారి చేసిన అతలాకుతలం అంతా ఇంతా కాదు. లక్షలాది ప్రాణాలు గాలిలో కలిసిపోగా, కోట్లాది కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. ఆర్థికంగానూ చితికిపోయాయి. లాక్‌డౌన్‌తో పేదలకు తిండి దొరకని పరిస్థితి సైతం నెలకొంది. చనిపోయిన వారి అంత్యక్రియలు సైతం చేయలేని దీన స్థితి కనిపించింది. డ్రాగన్ దేశంలో ఐదేళ్ల క్రితం కోవిడ్ పుట్టి ప్రపంచాన్ని వణికించిన విషయం తెలిసిందే. కరోనా వైరస్‌ను జనం మర్చిపోతున్న తరుణంలో మరో కొత్త వైరస్‌కు చైనా పుట్టినిల్లుగా మారింది. హ్యూమన్ మెటా ఫిన్యూమో వైరస్ అక్కడ వందలాది మందిని ఆస్పత్రి పాలు చేస్తున్న దృశ్యాలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వైరస్‌తో ముప్పేమి లేదని చైనా చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు కానరావడం లేదని వార్తలు వస్తున్నాయి. గతంలో జరిగిన పొరపాట్లతో ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అలా జరగకుండా కేంద్ర ప్రభుత్వం ఈసారి ముందుగానే అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వాలను అలర్ట్ చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కొత్త వైరస్‌పై అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు పాటించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కోవిడ్‌ను మర్చిపోతున్న తరుణంలో..

2020 సంవత్సరంలో జిల్లాలో కోవిడ్ మహమ్మారి ప్రవేశించింది. మొదటి విడతలో కేసులు నమోదైనప్పటికీ ప్రాణనష్టం జరగలేదు. రెండో విడతలో చిన్నాపెద్ద తేడా లేకుండా బారిన పడి మరణించారు. వైద్యారోగ్య శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 7లక్షల 36వేల 344 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా, 19,704 మందికి నిర్ధారణ అయ్యింది. 92 మంది మృత్యువాత పడినట్లు చెబుతున్నారు. అనధికారికంగా 300పైగానే మరణించినట్లు అంచనా. ఈ సమయంలో కొత్తరకం వైరస్ మళ్లీ దడ పుట్టిస్తోంది. అయితే కోవిడ్ నివారణకు టీకాలు ఇవ్వడంతో చాలా మందిలో రోగనిరోధక శక్తి పెరిగిన విషయం తెలిసిందే. ప్రజలు అప్రమత్తంగా ఉంటే వైరస్ బారి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

హెచ్‌ఎంపీవీ అంటే..

హ్యూమన్ మెటా ఫిన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) శ్వాసకోశ సంబంధిత వైరస్‌ను పోలి ఉంటుంది. శీతాకాలంలో జలుబు, ఫ్లూ వంటి లక్షణాలను కలిగి ఉండగా, రాష్ట్రంలో ఇప్పటివరకు ఈ కొత్త కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. అయితే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కోవిడ్ మాదిరిగా ఈ వైరస్ లక్షణాలు ఉంటాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులపై ఎక్కువగా ప్రభావం చూపనుంది. దీనికి సంబంధించి ఇప్పటివరకు చికిత్స లేకపోగా, జాగ్రత్త ఒక్కటే నివారణ అని అధికారులు పేర్కొంటున్నారు. కోవిడ్ సమయంలో పాటించిన జాగ్రత్తలే అవసరమని పేర్కొంటున్నారు.

'కవ్వాల్'లోకి రాత్రిపూట నో ఎంట్రీ..



ఆర్డర్ కాపీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



కొత్తగూడ చెక్‌పోస్ట్ వద్ద నిలిచిన వాహనాలు

- తొమ్మిది దాటితే ఆగాల్సిందేనట!
- కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద వాహనాలను అడ్డుకున్న సిబ్బంది
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు, ప్రయాణికులు
- అర్ధరాత్రి చెక్‌పోస్ట్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే బొజ్జు
- అధికారులతో చర్చించి అనుమతించేలా చర్యలు

ఉట్నూర్‌రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా రాత్రి తొమ్మిది గంటల తరువాత కవ్వాల్ అభయారణ్యం గుండా చిన్న వాహనాలు వెళ్లకూడదని అటవీ అధికారులు కొత్త నిబంధనలు తీసుకువచ్చారు. దీంతో శనివారం రాత్రి ఉట్నూర్ మండలం కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద భారీగా కార్లు, ఇతరచిన్న వాహనాలను అక్కడ సిబ్బంది నిలిపివేశారు. ఎముకలు కొరికే చలిలో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హుటాహుటిన అర్ధరాత్రి 12 గంటలకు అక్కడికి చేరుకున్నారు. వాహనదారులు, ప్రయాణికులతో మాట్లాడారు. చలిలో వారు ఇక్కట్లను గుర్తించి చెక్‌పోస్ట్ సిబ్బందిని నిలదీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము వాహనాలు నిలిపివేశామని చెప్పడంతో ఎమ్మెల్యే వెంటనే నిర్మల్ ఎఫ్‌డీపీటీతో ఫోన్‌లో మాట్లాడారు. కొత్త నిబంధనలు ఎందుకు పెట్టారనిప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేనే కాకుండా వైల్డ్‌లైఫ్ బోర్డుమెంబర్ అనే విషయం గుర్తు చేశారు. తనకు తెలియకుండా కొత్త నిబంధనలు ఎలా అమలుపరుస్తారని ప్రశ్నించారు. వెంటనే వాహనాలను విడిచి పెట్టాలన్నారు. ఆదిలాబాద్ డీఎఫ్‌వోతో కూడా ఫోన్లో మాట్లాడారు. ప్రజలను ఇబ్బందికి గురిచేసే చర్యలు మానుకోవాలని సూచించారు. చిన్న వాహనాల అనుమతి విషయంలో తాను అటవీశాఖ మంత్రి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌తో ఉదయం మాట్లాడుతానన్నారు. అలాగే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఉన్నతస్థాయి నిర్ణయం జరిగే వరకు చిన్న వాహనాలను ఆపకూడదని సూచించారు. అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తీసుకురావడంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు బీర్సాయిపేట రేంజ్ అధికారి అరుణ, చెక్‌పోస్టు సిబ్బంది వాహనాలను అనుమతించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: పదేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై అసంపూర్తిగా నిలిచిన జిల్లా మహిళా సమాఖ్య భవనం దుస్థితిపై 'మహిళాశక్తిపై నిర్లక్ష్యమేలా?' శీర్షికన గతేడాది నవంబర్ 19న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ రాజర్షి షా అవసరమైన నిధులతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వారి నివేదిక ఆధారంగా తుది మరమ్మతు పనుల కోసం కలెక్టర్ రూ.10లక్షలు మంజూరు చేశారు. పనులు సైతం పూర్తయ్యాయి. ప్రస్తుతం అన్ని హంగులతో సిద్ధమైన ఈ భవనాన్ని మంత్రి సీతక్క చేతుల మీదుగా సోమవారం ప్రారంభించనున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన భవనం

క్లుప్తంగా

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



గుంతలో పడ్డ కారును తీస్తున్న స్థానికులు

ముధోల్: మండలంలోని రాంటెక్ ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం కారుబోల్తా పడింది. వివరాల్లోకి వెళ్తే.. ముధోల్ మండల కేంద్రానికి చెందిన సాయి తన కారులో భైంసాకు వెళ్తుండగా సరస్వతీ నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద కారు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడింది. అక్కడున్న స్థానికులు గమనించి కారులో నుంచి సాయిని బయటకు తీశారు. కాగా సాయికి పెద్ద ప్రమాదం తప్పింది.

పశువుల అపహరణకు యత్నం

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గణేశ్‌నగర్‌లో కొందరు దొంగలు పశువుల అపహరణకు విఫలయత్నం చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. గణేశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మల్లంపల్లి పోషయ్యకు చెందిన ఆవులను అపహరించేందుకు నలుగురు వ్యక్తులు శనివారం రాత్రి నంబర్ ప్లేట్ లేని ట్రాలీలో ఎక్కించారు. అనంతరం రోడ్డుపై ఉన్న మరో ఆవును ట్రాలీలో ఎక్కించే ప్రయత్నం చేయగా అక్కడే ఉన్న స్థానికుడు జెట్టి వెంకన్న చూసి కేకలు వేశాడు. దీంతో దుండగులు వెంకన్నపై దాడికి యత్నించారు. చుట్టుపక్కల వారు నిద్రనుంచి మేల్కోవడంతో దొంగలు ఆవులను అక్కడే వదిలేసి పారిపోయారు. అనంతరం స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న బ్లూకోర్ట్ పోలీసులు వివరాలు సేకరించారు. స్థానిక సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా పశువుల దొంగలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.


అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు మూడు ఆటోల్లో 17.5 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా చాందా(టి) బైపాస్ వద్ద ఆదివారం పట్టుకున్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన అక్రమ్, తన్వీమ్, అర్బాజ్ ఖాన్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మూడు ఆటోలతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో ఆదివారం తెలంగాణ తెలుగు ప్రగతి ఫోరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా దేవరాజు, రేవతి, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, రవీందర్, కోశాధికారులుగా జాదవ్, ప్రేమ్‌సింగ్ ఎన్నికయ్యారు.

సరదా.. సరదాగా..!



పిచ్చుక

- కవ్వాల్‌లో రెండోవిడత బర్డ్‌వాక్
- కుటుంబ సభ్యులతో కలిసి పలువురు హాజరు
- పక్షులను చూసి మురిసిపోయిన పక్షిప్రేమికులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో నిర్వహించిన రెండో విడత బర్డ్‌వాక్ సరద సరదాగా గడిచింది. ఈ బర్డ్‌వాక్‌కు నిర్మల్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల నుంచి 15 మంది పక్షి ప్రేమికులు హాజరయ్యారు. వారికి ఇందన్‌పల్లి రేంజ్‌లోని ఘనిషెట్టి కుంట వద్ద బస ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి అధికారులు ఏర్పాటు చేసిన టెంట్‌లలో నిద్రించి, ఆదివారం ఉదయం బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు. ఈ సారి నిర్మల్‌కు చెందిన మూడు కుటుంబాలు, పిల్లలతో సహా బర్డ్‌వాక్‌లో పాల్గొనడం విశేషం. పిల్లలు చాలా సరదాగా గడిపారు. ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. బైనాక్యులర్ ద్వారా పక్షులను చూస్తూ మురిసిపోయారు. కరీంనగర్‌కు చెందిన పలువురు ఉద్యోగులు, వైద్యులు బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు. పలు రకాల ఫొటోలను కెమెరాలో బంధించారు. అనంతరం సఫారీ ద్వారా మైసమ్మ కుంట, కామన్‌పల్లి, వాచ్‌టవర్ ప్రాంతాలలో పర్యటించారు. వన్యప్రాణులను నేరుగా వీక్షించారు.



అడవిలో పక్షులను కెమెరాలో బంధిస్తున్న సందర్శకులు



బర్న్ స్వాలో పక్షి



బైనాక్యులర్‌తో పక్షులను చూస్తున్న సందర్శకురాలు



గ్రీన్ హెడెడ్ ఫిష్‌ఈగల్

చెన్నూర్ రేంజ్ పరిధిలో..

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలోని కిష్టంపేట, భీమారం మండలంలోని బూరుగుపల్లి అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో బర్డ్‌వాక్ నిర్వహించారు. శనివారం సాయంత్రం కిష్టంపేటలోని అంబేద్కర్ ఈకో టూరిజమ్ పార్క్‌లో సందర్శకులు రిజిస్ట్రేషన్ చేసుకుని రాత్రి క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. హైదరాబాద్, కరీంనగర్, ఎన్టీపీసీ, మందమర్రి ప్రాంతాల నుంచి సుమారు 21 మంది సందర్శకులు వచ్చారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు కిష్టంపేట అర్బన్ పార్కు నుంచి సఫారి వాహనాల్లో బూరుగుపల్లి సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టుకు చేరుకొని బర్డ్‌వాచింగ్‌లో పాల్గొన్నారు. అక్కడ ఎన్నో రకాల పక్షులను గుర్తించారు. సందర్శకులు తమ కెమెరాలతో పక్షుల ఫొటోలు తీసుకున్నారు. ప్రాజెక్టు రిజర్వ్ అడవి ఉండటంతో నీటిలో ఉండే పక్షులు, వృక్షాలపైన ఉండే పక్షులను సుమారుగా 120 వరకు గుర్తించారు. అక్కడి నుంచి కిష్టంపేట అర్బన్ పార్కు వద్దకు చేరుకొని అనేక రకాల పక్షులు, సీతాకోక చిలుకలు ఉన్నట్లు రిసోర్స్ పర్సన్ రాంజాన్ విరాని గుర్తించారు. మంచిర్యాల రేంజ్ అధికారి రత్నాకర్, చెన్నూర్ అటవీ రేంజ్ అధికారి శివకుమార్, డీఆర్వో ప్రభాకర్ ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు, సందర్శకులు పాల్గొన్నారు.



కిష్టంపేట సమీపంలోని అంబేద్కర్‌అర్బన్ పార్కులో సందర్శకులు, అటవీశాఖ అధికారులు

సౌకర్యాలు కల్పించాం



ముందుగా జన్నారం నర్సరీలో బస ఏర్పాటు చేయాలనుకున్నాం. కానీ పర్యాటకుల ఒత్తిడి మేరకు ఘనిషెట్టి కుంటలో బస ఏర్పాటు చేశాము. భోజనం, డేరాల సౌకర్యాలు కల్పించాం. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బందితో కలిసి అన్ని వసతులు ఏర్పాటు చేశాం.

– కారం శ్రీనివాస్, రేంజ్ అధికారి

కొత్త అనుభూతినిచ్చింది..



బర్డ్‌వాక్‌కు కుటుంబంతో వచ్చాం. రాత్రి అడవిలో గడపడం కొత్త అనుభూతినిచ్చింది. రాత్రి పక్షుల శబ్దాలు చాలా ఆహ్లాదాన్ని కలగజేశాయి. నా భర్త, పిల్లలతో కలిసి ఫైర్ క్యాంపులో చాలా ఎంజాయ్ చేశాను. తెల్లారి చాలా రకాల పక్షులను వీక్షించాము.

– విష్ణుతేజ, నిర్మల్

చాలా రకాల పక్షులను గుర్తించాం



ఇక్కడి వాతావరణంలో గడపడం కొత్త అనుభూతినిచ్చింది. పక్కనే నీటి కుంట, పచ్చని అడవుల మధ్య స్వచ్ఛమైన వాతావరణంలో గడపడం చాలా బాగుంది. ఉదయాన్నే పలు పక్షులను కెమెరాలో బంధించాను. బర్డ్‌వాక్ నిర్వహించడం వల్ల అందరితో స్నేహభావం ఏర్పడుతుంది.

– నర్సింహారెడ్డి, వైద్యుడు, నిర్మల్

పర్యావరణంపై అవగాహన



ఇదివరకు బర్డ్‌వాక్ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పర్యావరణం, ఎకోసిస్టంపై అవగాహన కలుగుతుంది. యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. బర్డ్‌వాక్ ద్వారా వివిధ ప్రాంతాల బర్డ్‌వాకర్ల మధ్య స్నేహబంధం పెరుగుతుంది.

– దీపక్‌రెడ్డి, కరీంనగర్

చాలా ఎంజాయ్ చేశా



బర్డ్‌వాక్‌లో నేను మా అమ్మానాన్నలతో కలిసి వచ్చాను. రాత్రి క్యాంప్‌ఫైర్, అడవిలో నిద్రించడం గొప్పగా అనిపించింది. పొద్దున అనేక రకాల పక్షులను చూశాను. బైనాక్యులర్‌లో పక్షులను గుర్తించి వాటి పేర్లను అడిగి తెలుసుకున్నాను.

– సాయి ఇక్షిత, ఐదో తరగతి విద్యార్థిని, నిర్మల్

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా, ఎస్సై శ్రీకాంత్

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన బొబ్బిలి సాయికుమార్, తన స్నేహితుడు మైనర్ బాలుడితో కలిసి అదే గ్రామానికి చెందిన అర్షద్ అనే యువకుడిపై హత్యాయత్నం చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బోరిగాం గ్రామానికి చెందిన షేక్ అర్షద్, సాయికుమార్‌లు స్నేహితులు. వీరిద్దరి మధ్య డిసెంబర్ 31, 2024న స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సాయికుమార్, మైనర్ బాలుడితో కలిసి ఈనెల 4న అర్షద్‌ను గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు రప్పించాడు. అనంతరం సాయికుమార్ వెంట తెచ్చుకున్న కత్తితో మైనర్ స్నేహితుడితో కలిసి హత్యాయత్నం చేశాడు. అర్షద్ గాయపడగా స్థానికులు గమనించి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు సాయికుమార్‌తో పాటు మైనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కేసు వివరాలను ఏఎస్పీ రాజేశ్ మీనా, సీఐ రామకృష్ణలు పర్యవేక్షిస్తున్నారు.

సెల్ఫీ తీసుకుంటూ.. పురుగుల మందు తాగాడు..



పురుగుల మందు తాగుతున్న యువకుడు

కౌటాల: సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఓ యువకుడు పురుగుల మందు తాగిన ఘటన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగింది. కౌటాల మండలం బోదంపల్లి గ్రామానికి చెందిన కె.వెంకటేశ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని తండ్రి గతంలోనే మరణించాడు. తల్లి సత్తక్క కూలీ పనులు చేస్తోంది. శనివారం ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపం చెందాడు. గ్రామ శివారుకు వెళ్లి.. సెల్ఫీ వీడియో తీసుకుంటూ క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన స్థానికులు తల్లికి సమాచారం అందించారు. అనంతరం కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంకటేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ఆదివారం తెలిపారు. వేరే కులం యువతిని ప్రేమించడంతోనే ఇంట్లో గొడవ జరిగినట్లు సమాచారం. ఈ విషయమై కుటుంబ సభ్యులు వెంకటేశ్‌ను మందలించారని సమాచారం. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎవరూ ఫిర్యాదు చేయలేదని కౌటాల పోలీస్ అధికారులు తెలిపారు.

ఓపీఎస్ అమలు చేయాలి

- పేటా టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(పేటా)తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్ తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివా రం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ పెండింగ్ బిల్లులు మంజూరు కు కృషి చేస్తున్నామన్నారు. స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన జీవోను సవరించి క్రీడాకారుడికి లబ్ధి చేకూరేలా ప్రయత్నిస్తున్నామన్నారు.

పేటా నూతన కమిటీ ఎన్నిక

ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అసోసియేషన్ (పేటా తెలంగాణ) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రేణి రాజయ్య, ప్ర ధాన కార్యదర్శి బెల్లం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షురాలిగా రోసి వరకుమారి, కోశాధికారిగా వి జయ్‌చంద్రరావును ఎన్నుకున్నట్లు పర్యవేక్షకు డు వేల్పుల సురేందర్ తెలిపారు. సమావేశంలో నల్గొండ, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్ర య్య, సురేందర్, సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు మీనారెడి ఉ పాధ్యక్షుడు యాకుబ్, ఉమామహేశ్వరి, లింగ య్య, జహ్నవి మంజుల పాల్గొన్నారు.

'కార్మికులను లెటర్లతో వేధించడం సరికాదు'



రియాజ్ అహ్మద్

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఎస్టీపీపీలో ఏర్పాటు చేసిన సమావేశానికి వచ్చిన కాంట్రాక్టు కార్మికులకు బెదిరింపు లెటర్లు ఇచ్చి వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ సంబంధిత కంపెనీ అధికారులను హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా సింగరేణి యాజమాన్యం, విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీ అధికారుల దృష్టికి కాంట్రాక్టు కార్మిక సమస్యలను తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. కార్మిక సమస్యలపై సమ్మె చేయడం కోసం సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో కక్ష సాధింపుగా అధికారులు కార్మికులకు లెటర్లు ఇస్తున్నారని, దీన్ని పూర్తిగా మానుకోవాలన్నారు. ఇతర పవర్ ప్లాంట్లో చెల్లిస్తున్న విధంగా ఇక్కడ కూడా కార్మికులకు అర్హతకు తగిన వేతనాలు, అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సింగరేణి సొత్తుకు భద్రతేది?

- చోరీ అవుతున్న ఖరీదైన స్క్రాప్, సామగ్రి
- సిబ్బంది కొరతతో ప్రైవేట్ సెక్యూరిటీ నియామకం
- దొంగలను పట్టుకోవడంలో విఫలం
- ఇటీవలే వర్క్‌షాపులో చోరీకి విఫలయత్నం
- వ్యవహారంపై విజిలెన్స్ ఆరా



వర్క్‌షాపులోనికి చొరబడిన దొంగ(ఫైల్)



గోడ దూకుతున్న దొంగ(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో విచ్చలవిడిగా దొంగలు స్వైర విహారం చేస్తున్నా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకోలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏరియాలో అనేక దొంగతనాలు జరిగినా కనీసం ఒక్కచోటనైనా దొంగలను పట్టుకోలేదు. ఏరియాలోని విధి నిర్వహణలో భాగంగా సిబ్బంది కొరత వలన ప్రాధాన్యత ఉన్నటువంటి చోట ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను విధుల్లో ఉంచడం వలన దొంగలకు చోరీ చేయడం సులువవుతుందనే ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి.

సిబ్బంది కొరత..

మందమర్రి ఏరియా నుంచి మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, కాసిపేట ఏరియాల్లో సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహించాలి. ఏరియా వ్యాప్తంగా సుమారు 250 వరకు పోస్టులు ఉన్నాయి. దానిలో 100 మంది సింగరేణి సిబ్బంది ఉంటే సగానికి పైగా అంటే 140 వరకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులే ఉన్నారు. కాంట్రాక్టర్లు మారినప్పుడల్లా నిబంధనలకు విరుద్ధంగా మామూళ్లకు కక్కుర్తిపడి ఇష్టారీతిగా ప్రైవేట్ సెక్యూరిటీని నియమిస్తున్నారు. ఇప్పటికైనా సరిపడా సింగరేణి సెక్యూరిటీని నియమించి ప్రాధాన్యత గల పోస్టుల్లో ఉంచాలని, సింగరేణి ఆస్తులను కాపాడే విధంగా చూడాలని పలువురు సూచిస్తున్నారు. చోరీ జరిగిన చోట సంబంధిత కాంట్రాక్టర్ వద్ద నుంచి చోరీకి గురైన సామగ్రి విలువగల సొమ్ము వసూలు చేయాలని పలువురు పేర్కొంటున్నారు. పనికిరాని స్క్రాప్‌ను ఎప్పటికప్పుడు విక్రయిస్తే సంస్థకు కూడా ఆదాయం వస్తుందని సూచిస్తున్నారు.

విచ్చలవిడిగా దొంగతనాలు..

మందమర్రి ఏరియాలో ఆర్కే1ఏ, కేకే 1 గనులు మూసివేయడం వలన ఆ గనుల వద్ద భారీ మొత్తంలో ఖరీదైన స్క్రాప్, విలువైన సామగ్రి నిల్వ ఉంటుంది. ఆ గనులను టార్గెట్‌గా చేసుకుని దొంగలు విచ్చలవిడిగా చోరీలకు పాల్పడున్నారు. విలువైన సామగ్రిని కళ్లుమూసి తెరిచే లోపే మాయం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్నటువంటి సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేసినా దాడి చేసి మరీ వచ్చిన పని కానిచ్చేస్తున్నారు. ఏరియాలోని గనుల్లో తొలగించిన సామగ్రిని ఏరియా వర్క్‌షాపులో నిల్వ ఉంచుతారు. సుమారు తొమ్మిది, పది ఫీట్ల ఎత్తున్న ప్రహరీని అవలీలగా ఎక్కి వారి పని చేసుకుంటున్నారు. ఇటీవల ఓ దొంగ వర్క్‌షాపు ప్రహరీ గోడ దూకి లోనికి వచ్చి చోరీకి ప్రయత్నించగా విధి నిర్వహణలో ఉన్న సెక్యూరిటీ టార్చ్‌లైట్ వెలుతురు చూపించడంతో అప్రమత్తమై గోడ దూకి పరారయ్యాడు. ఈ వ్యవహారంపై సెక్యూరిటీ అధికారులు ఆరా తీస్తున్నారు. పది ఫీట్ల గోడ దూకి లోనికి వచ్చిన దొంగను పట్టుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు పట్టుకోలేక పోయారనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారమంతా వర్క్‌షాపులో అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డు అయినప్పటికీ ఇంతవరకు కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంలో ఆంతర్యమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రాయపూర్‌కాండ్లీలో మనుబోతులు



రాయపూర్‌కాండ్లీలో సంచరిస్తున్న మనుబోతులు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ ప్రాంతంలోని సాయి రైస్‌మిల్ పక్కన రెండు మనుబోతులు ఆదివారం సంచరిస్తూ దర్శనమిచ్చాయి. లోకేశ్వరం, పంచగుడి మార్గం నుంచి వెళ్లే ప్రజలు మనుబోతులను తిలకించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలోని పెన్‌గంగ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను భీంపూర్ పోలీసులు ఆదివారం సాయంత్రం పట్టుకున్నారు. పిప్పల్‌కోటి రోడ్డు వద్ద ఎస్సై కలీం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా తాంసి(కె) నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇసుక ట్రాక్టర్‌లపై తదుపరి చర్యలపై మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు. మండలంలో పెన్‌గంగ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజారోగ్యం కోసం కేంద్ర పథకాలు

- ఎంపీ నగేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

జన్నారం: అన్ని వర్గాల ప్రజల ఆరోగ్యం ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెడుతోందని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర సినిమా హాలు ఆవరణలో రాఘవేంద్ర ట్రస్టు, మెడిలైఫ్ సంయుక్తంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించే దిశగా ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించిందని పేర్కొన్నారు. పేద, గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో మెగా వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య పరీక్షలు, మందులతో పాటుగా దూర ప్రయాణం చేసిన రోగులకు రవాణా సౌకర్యం, భోజన సౌకర్యం కల్పించిన నిర్వాహకులు మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌ను ఎంపీ అభినందించారు.

ప్రజాసేవ కోసం పార్టీలకతీతంగా..

ప్రజలకు సేవలందించేందుకు పార్టీలకతీతంగా ముందుంటానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. రాఘవేంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరానికి హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నిరుపేదలకు చక్కని వైద్యం, చికిత్సలతో పాటు మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. బీజేపీ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, రాఘవేంద్ర ట్రస్టు సభ్యులు నరేశ్, సంపత్, బీఆర్ఎస్ నాయకులు మున్వర్ అలీఖాన్, గంగాధర్, ఫజల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ సిబ్బందికి బెదిరింపులు!

కాసిపేట: బెల్లంపల్లి నుంచి మండలంలోని పెద్దనపల్లి, సండ్రల్‌పహడ్ మీదుగా కాసిపేటకు నిర్మిస్తున్న రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బందిని శనివారం రాత్రి కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. పెద్దనపల్లి, సండ్రల్‌పహడ్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మిస్తున్న సిబ్బంది వద్దకు కొందరు వ్యక్తులు వెళ్లి తమకు సిమెంటు బస్తాలు, కంకర, ఇసుక కావాలని అడగ్గా ఇన్‌చార్జీతో మాట్లాడుకోవాలని సిబ్బంది తెలిపారు. దీంతో సిబ్బందిని దూషిస్తూ పనులు బంద్ చేయిస్తాం.. చంపేస్తామంటూ దుర్భాషలాడారు. సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగానే సదరు వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లుగా సమాచారం.

కాగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులు అధికార పార్టీకి చెందినవారు కావడంతో విషయం గోప్యంగా ఉంచుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయమై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.